క్లుప్తంగా

ఎంపీ రామసహాయం పర్యటన



దుర్గారాణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

ములకలపల్లి: ములకలపల్లిలో ఖమ్మం ఎంపీ రామసహాం రఘురాం రెడ్డి సోమవారం పర్యటించారు. చాపరాలపల్లి మాజీ సర్పంచ్ సున్నం రాంబాబు కూతురు సోయం దుర్గా రాణి ఇటీవల మరణించగా.. మామిళ్లగూడెంలో నిర్వహించిన దశదిన ఖర్మలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలసి ఎంపీ పాల్గొన్నారు. దుర్గారాణి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. రాంబాబు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. తొలుత చాపరాలపల్లికి చెందిన వ్యాపారి నూన్నా జగదీష్ కొడుకు చాణక్య, కోడలు గీతిక వివాహ విందులో పాల్గొని, నవ దంపతులకు శుభాశీస్సులు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ సర్పంచ్‌లు కారం సుధీర్, సున్నం సుధాకర్, నాగళ్ల వెంకటేశ్వరరావు, గాడి తిరుపతిరెడ్డి, నల్లమోతు జగదీశ్, వెంకయ్య, అచ్చెన వెంకటేశ్వరరావు, సురభి రాజేశ్, పాలకుర్తి సుమిత్, తన్నీరు లోకేశ్, సూర్యకేతన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికులంతా ఐక్యంగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం అన్నారు. సోమవారం మండలంలోని వినాయకపురం గ్రామంలో ఏఐటీయూసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు, కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేయడం సీపీఐకే సాధ్యమని అన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులంతా బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశానికి మండలంలోని ఆసుపాక, వినాయకపురం, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, దురదపాడు గ్రామాలకు చెందిన ఆటో కార్మికులు హాజరైయ్యారు. మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, పఠాన్ జలాల్ ఖాన్, నూకవరపు విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటాలు



ఇళ్ల స్థలాల కోసం దీక్ష చేస్తున్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: నిరుపేద గిరిజన కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటాలు చేస్తామని, బాధిత కుటుంబాలకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్–ప్రజాపంథా పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. సోమవారం వినాయకపురం సమీపంలోగల ఎర్రగుంటపల్లి వద్ద గిరిజనులు ఆక్రమించి గుడిసెలు వేసిన ప్రాంతంలో పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలతో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీన దమ్మపేట, అశ్వారావుపేట ఫారెస్టు అధికారులు దౌర్జన్యంగా గిరిజనులు నిర్మించుకున్న గుడిసెలను తొలగించారని, అధికారుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. పేదలంతా ఐక్యంగా ఉండి ఇళ్ల స్థలాలను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, నాయకులు కుంజా అర్జున్, పండా ముత్యాలు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల ఇంటింటి ప్రచారం

మణుగూరురూరల్: ఈ నెల 23న జరిగే సీపీఎం మండల మహాసభలకు జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు సోమవారం మండలంలోని సమితిసంగారం గ్రామ పంచాయతీలో కరపత్రాలు పంపిణీ చేస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొడిశాల రాములు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టేందుకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. 23న జరిగే మహాసభలకు రాష్ట్ర నాయకులు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్యలు హాజరౌతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు సత్రపల్లి సాంబశివరావు, బొల్లం రాజు, తోట పద్మ, గౌరి, దొడ్డి నిర్మల, కమల హేమంతరావు, నరసయ్య పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించేదెన్నడు?

- ప్రధాన కూడలిలో కనబడని టాయిలెట్లు
- మహిళలు, వృద్ధుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



బయ్యారం క్రాస్ రోడ్ ప్రధాన కూడలి..

పినపాక: మండల పరిధిలోని ఈ బయ్యారం ప్రధాన కోడలు పబ్లిక్ టాయిలెట్స్ లేక మహిళలు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన కూడళ్లలో టాయిలెట్లు లేకపోవడంతో ఎటు వెళ్ళాలో తెలియక వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వాలు మారినా అదే తీరు..

గత కొన్ని సంవత్సరాలుగా బయ్యారం క్రాస్ రోడ్ ప్రధాన కూడళిగా మారింది. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా ఇక్కడ పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని డిమాండ్ వినపడుతోంది. కానీ ప్రభుత్వాలు, పాలకులు, నాయకులు మారుతున్నప్పటికీ టాయిలెట్స్ నిర్మించాలనే ధ్యాసే లేదు. మణుగూరు–ఏటూరు నాగారం–కరకగూడెం వంటి గ్రామాలకు వెళ్లడానికి బయ్యారం క్రాస్ రోడ్ ప్రధాన కూడలిగా మారింది. ప్రతిరోజు దాదాపు 200 మంది వివిధ ప్రాంతాలకు ఈ కూడలి నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. బయ్యారం పోలీస్ స్టేషన్ కూడా కూడలి సమీపంలోనే ఉండటం, నిత్యం ఫిర్యాదుల కొరకు వచ్చి వెళ్లేవారు కూడా చాలామంది ఉన్నారు. గతంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలన్న డిమాండ్ మేరకు అప్పటి తహసీల్దార్ విక్రమ్ కుమార్ స్థల సేకరణ చేయాల్సిందిగా కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ అది అంతటితోనే ముగిసింది. ఇప్పటికైనా మరుగుదొడ్ల నిర్మాణం కార్యరూపం దాల్చాలని స్థానికులు కోరుతున్నారు.

నానా ఇబ్బందులు పడుతున్నాం..

దూర ప్రాంతాలకు ఎటు వెళ్లాలన్న ప్రధాన కూడలి బయ్యారం క్రాస్ రోడ్ నుంచి వెళ్లాలి. కొన్నిసార్లు బస్సులు, ఆటోల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. ఆ సమయంలో టాయిలెట్స్ వెళ్లాలంటే ఎటు వెళ్లాలో తెలియక నానా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి ప్రధాన కూడలిలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలి.

– రాజ్యలక్ష్మి, పినపాక

అధికారులకు ఫిర్యాదు చేశాం..

బయ్యారం క్రాస్ రోడ్ ప్రధాన కూడలి నుంచి నేను ప్రతిరోజూ మణుగూరు, ఏటూరు నాగారంకు ఆటో నడుపుతున్నాను. క్రాస్ రోడ్‌లో ఉన్న సమయంలో టాయిలెట్స్‌కు వెళ్లాలంటే చాలా దూరం నడుచుకుంటూ వెళ్లి వచ్చే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలి.

– ప్రవీణ్, ఆటో డ్రైవర్

ప్రతిపాదనలు సిద్ధం..

బయ్యారం ప్రధాన కూడలిలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని డిమాండ్ ఎప్పటినుంచో వినిపిస్తోంది. పై అధికారులకు బయ్యారం క్రాస్ రోడ్ ప్రధాన కూడలి, జానంపేటలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించాలని ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభించి టాయిలెట్లు నిర్మిస్తాం.

– శ్రీనివాసరావు, ఎంపీఓ, పినపాక

దుమ్ముగూడెంలో ఎమ్మెల్యే పర్యటన



ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండల కేంద్రం దుమ్ముగూడెం గ్రామంలోని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్‌బెడ్ రూం ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలు మిషన్ భగీరథ నీటి సమస్య, చేతిపంపు రిపేర్ ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం తదితర సమస్యలపై వినతి పత్రం సమర్పించగా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో జరుగుతున్న సామాజిక సర్వే తీరును పరిశీలించారు. సబంధిత వివరాలను ఎన్యూమరేటర్లను అడిగి ఆయన తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరిగిన దశదిన కర్మలో పాల్గొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తేమ శాతం 17 ఉండాలి



ధాన్యం తేమ శాతాన్ని పరీక్షిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు

ములకలపల్లి: ధాన్యం కొనుగోలు సమయంలో ఖచ్చితంగా తేమశాతం 17 ఉండేలా జాగ్రత్త వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు తెలిపారు. మండల పరిధిలోని మాధారం ధాన్యం కొనుగోలు కేంద్రం (పీపీసీ)ను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. యార్డులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. తేమశాతాన్ని పరీక్షించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెంటర్లలో రైతులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. మండల వ్యవసాయాధికారి వరుణ్ బాబు, సొసైటీ చైర్‌పర్సన్ నడిపల్లి సునంద, సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు, పీపీసీ ఇన్‌చార్జ్ బొమ్మకంటి కామేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఏఓగా ఎంపికైన మహిళకు సన్మానం




యమునదుర్గా దంపతులను సన్మానిస్తున్న యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు

దమ్మపేట: ఇటీవలే టీజీపీఎస్సీ విడుదల చేసి వ్యవసాయ అధికారుల ఉద్యోగ ఫలితాల్లో మండలంలోని వెంకటాద్రిగూడెం గ్రామానికి చెందిన ఎలికే యమున దుర్గా మండల వ్యవసాయ అధికారి (ఏఓ)గా ఉద్యోగం సాధించగా.. ఆమెను మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. దమ్మపేట గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు, యమునదుర్గా దంపతులను శాలువాతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు దొడ్డా కుల రాజేశ్వరరావు, జోనెబోయిన శ్రీనివాసరావు, చక్కిరాల మల్లేశ్వరరావు, యర్రగొర్ల రాధకృష్ణ, సాయిల నర్సీ, గొర్ల భవానికృష్ణ, తాళ్ల శంకర్రావు, ముళ్లపూడి వెంకటేశ్వరరావు, గుర్రం మల్లేష్, కోట వెంకటేశ్వరరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అశ్వారావుపేటరూరల్: వివిధ కారణాలతో మృతి చెందిన కుటుంబాలను స్థానిక మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. సోమవారం మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన సాధనం పెద్ద వెంకటేశ్వరరావు దశదిన కార్యక్రమానికి హాజరై మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇదే గ్రామానికి చెందిన స్వర్ణ నాగేశ్వరరావు కుమారుడు ఇటీవలే గుంటూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అలాగే ఆసుపాక గ్రామానికి చెందిన పింగిళి రాము పూరిల్లు దగ్ధం కాగా.. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా అశ్వారావుపేటకు చెందిన గుమ్మడి నారాయణమ్మ కొద్ది రోజుల క్రితం పాముకాటుకు గురై మృతి చెందగా, ఆమె చిత్రపటానికి పూల మాల వేసి కుటుంబీకులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, వెంకన్నబాబు, లక్ష్మీనర్సయ్య, సత్యవరపు సంపూర్ణ, బుజ్జిబాబు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలే లక్ష్యం



వార్షికోత్సవ కార్యక్రమంలో కేక్ కట్ చేస్తున్న నేస్తం ట్రస్ట్ ప్రతినిధులు

బూర్గంపాడు: సామాజిక సేవా కార్యక్రమాలే లక్ష్యంగా నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ 13ఏళ్లుగా పనిచేస్తుందని ట్రస్ట్ చైర్మన్ బత్తుల రామకొండారెడ్డి అన్నారు. ట్రస్ట్ 13వ వార్షికోత్సవం సోమవారం మోరంపల్లిబంజరలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యం, రక్తదానం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగించేందుకు 13 ఏళ్ల కిందట 13మంది సభ్యులతో నేస్తం ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. పేద, మధ్య తరగతికి చెందిన పలువురికి వైద్యసేవలకు ఆర్థిక సాయమందించామని తెలిపారు. పేద పిల్లల ఉన్నత చదువులకు తమ ట్రస్ట్ నుంచి ఆర్థిక చేయూతనందించినట్లు, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామని, ప్లాస్టిక్ నిర్మూలన, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

రానున్న రోజుల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను మరింతగా విస్తృతం చేస్తామన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు చింతా అంకిరెడ్డి, ఇండ్ల రాజేశ్, రాజేందర్‌రెడ్డి, సంకా సురేష్, పేరం రామిరెడ్డి, డి.బాలనారాయణరెడ్డి, ఆవుల నాగార్జునరెడ్డి, కె.రమేష్‌రెడ్డి, ఆవుల శివనాగిరెడ్డి, బిజ్జం వెంకట్రావిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈదయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 మార్చి 01,నుండి 2024 మార్చి 31 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

మణుగూరురూరల్: పవిత్ర కార్తీకమాసం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని పైలట్ కాలనీలో ఉన్న శ్రీకాళీమాత ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో భక్తులతో ఆలయ అర్చకులు ఉప్పల సత్యనారాయణశాస్త్రీ ఆధ్వర్యంలో శ్రీరమా సహిత వీరవెంకట సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించి తరించారు.

శతజయంతి ఉత్సవాలకు ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రామ్‌ను సేవాదల్ శతజయంతి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతు సేవాదల్ బాధ్యులు సోమవారం ఆహ్వానం అందించారు. ఈ నెల 20న హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగే ఉత్సవాల్లో పాల్గొన్నాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో సేవాదల్ డివిజన్ అధ్యక్షుడు పిలక వెంకట్రాంరెడ్డి, ఆశోక్‌కుమార్, దేసు కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రోటరీక్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో సాయంత్రం అల్పాహారం వితరణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు.

పదో తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు ప్రత్యేక తరగతుల నిర్వహణ నేపథ్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు కోరిక మేరకు ఈ మూడు నెలలు విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ దుమ్ముగూడెం బాధ్యులు మండపాటి సుధాకర్‌రెడ్డి, గుప్తా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీని బదిలీ చేయండి

మణుగూరుటౌన్: తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీని బదిలీ చేయాలని సోమవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఏఎన్‌ఎంలు కోరారు. ప్రజాభవన్‌లో ఏఎన్‌ఎంలు ఎమ్మెల్యేను కలిశారు. డాక్టర్ నిశాంత్‌కి శనివారం సమ్మె నోటీసు ఇచ్చిన నేపథ్యంలో.. ఏఎన్‌ఎంలు చేయబోయే సమ్మెను విరమించుకోవాలని ఆయన సూచించారు. యధావిధిగా క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంలు తమను ఎంఎల్‌హెచ్‌పీ హిమబిందు పెడుతున్న ఇబ్బందుల గురించి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డీఎంఅండ్‌హెచ్‌ఓ, పీహెచ్‌సీ వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎన్‌ఎంలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుని బదిలీ చేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ‘కోటి దీపోత్సవం’



అశ్వారావుపేటరూరల్: చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో..



బూర్గంపాడు: నాగినేనిప్రోలు శివాలయం వద్ద కార్తీక దీపోత్సవం..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామం వద్దగల చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆవరణలో కార్తీక మాసం నేపథ్యంలో కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి వేద పండితుల ఆధ్వర్యంలో శ్రీరాజరాజేశ్వరి సమేత త్రిగుణేశ్వర స్వామి వారికి, చిలకలగండీ ముత్యాలమ్మ అమ్మవారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేసి ‘సహస్ర లింగార్చన సహిత కోటి దీపోత్సవ’కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో చేశారు. ముందుగా వేదపండితులు, అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వినాయకపురం, వినాయకపురం కాలనీ, ఆసుపాక, మామిళ్లవారిగూడెం, నారాయణపురం, తిరుమలకుంట, ఊట్లపల్లి, జమ్మిగూడెం, అశ్వారావుపేటతోపాటు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కాగా.. ఆవరణ అంతా భక్తులతో పోటెత్తింది.

బూర్గంపాడు: కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాల్లో దీపోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు, భక్తులు తెల్లవారు జామునే గోదావరి స్నానమాచరించి దీపాలు వెలిగించారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలోని శివాలయంలో కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్

మణుగూరురూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్‌ఓటూ జీఎం డి.శ్యాంసుందర్ అన్నారు. మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్ ఆదేశాల మేరకు సింగరేణి పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో సోమవారం గ్రామస్తులకు వివిధ రకాల 250 పండ్ల మొక్కలను ఎస్‌ఓటూ జీఎం శ్యాంసుందర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఖర్చుకు వెనుకాడకుండా సింగరేణి, పరిసర, ప్రభావిత గ్రామాల్లో మొక్కలను పంపిణీ చేస్తోందన్నారు. మొక్కలను నాటి వాటి సంరక్షణను బాధ్యతగా చేపట్టాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు ఉచిత మెడికల్ వీటీసీ శిక్షణ ఇప్పించినందుకు గ్రామ గిరిజన యువతి ఏనిక స్వరూప ఎస్‌ఓటూ జీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధి కూడా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మణుగూరు ఎంపీడీఓ శ్రీనివాసరావు, మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసచారి, డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్, పర్యావరణ అధికారి జె.శ్రీనివాస్, రక్షణ అధికారి భాస్కర్, సతీష్, సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్‌డి.నాసర్‌పాషా, గ్రామపెద్దలు పాయం కామరాజు, లక్ష్మయ్య, పీసా కమిటీ అధ్యక్షుడు మడి నరసింహారావు, స్వరూప పాల్గొన్నారు.

శ్రీకృష్ణ పాండవ ఉత్సవాల్లో ఎమ్మెల్యే



శ్రీకృష్ణ పాండవ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: బూర్గంపాడులోని గౌతమిపురం కాలనీలో రెండురోజులుగా నిర్వహిస్తున్న కుంతీ సమేత శ్రీకృష్ణ పాండవ ఉత్సవాల్లో ఆదివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. గౌతమిపురంలోని గొంతెనమ్మ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆయనకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు గుర్తుండేలా ఉత్సవాలను ఘనంగా నిర్వహించటం అభినందనీయమన్నారు. ఇలాంటి దైవిక కార్యక్రమాలలో అందరు పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓ, ఎంపీఓలకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

దమ్మపేట: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని నాగుపల్లి రైతు వేదికలో తమ పెండింగ్ వేతనాలను చెల్లించి, స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ఎంపీఓ రామారావులకు వినతి పత్రమును అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మండల కార్యదర్శి బెజవాడ రాము మాట్లాడుతూ.. మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, చాలీచాలని వేతనాలతో నెట్టుకొస్తుండగా, ఐదు నెలలుగా వేతనాలను చెల్లించకపోవడం కడు శోచనీయం అన్నారు. ఈ సమస్యను జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మ, గొర్రెపాటి బసవయ్య, పెంటె ప్రభాకర్, సహదేవుడు, భాస్కర్, అన్నవరం, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..



పైకప్పు లేకుండా ఉన్న ఆలయ ఆవరణలోని శక్తిపీఠాలు

ములకలపల్లి: మండలపరిధిలోని మూకమామిడి శివారులోని భాస్కరగట్టు గుట్టపై ఉన్న ఉమాపృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయ శక్తిపీఠాలకు నిలువ నీడ కరువైంది. మూకమామిడి గ్రామానికి చెందిన శిగ బాయమ్మ వీరభద్రం దంపతులు ఈ ఆలయాన్ని నిర్మించారు. దేవాలయ ప్రాంగణంలో విశాలాక్షీ దేవి, భ్రమరాంభ దేవి. మాంగళ్యా దేవీ, జోగులాంభ దేవి, కామాక్షీ దేవీ, మాధవేశ్వరీ దేవీ, వైష్ణవీ దేవీ, మాహకాంళీ దేవీ, ఛాముండేశ్వరీ దేవి, గిరిజా దేవి, ఏకవీరా (రేణుకా) దేవీ పేరిట ద్వాదశ శక్తిపీఠాలతోపాటు నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. చాలా ఏళ్లపాటు నిత్యపూజలు నిర్వహించారు. వీరభద్రం మృతిచెందడంతో కుటుంబీకులే నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ఇదిలాఉండగా కాలక్రమేణా శక్తిపీఠాల పేరిట ప్రతిష్ఠించిన శివలింగాలపై నిర్మించిన రేకుల షెడ్డు ధ్వంసం కావడంతో, పైకప్పు కూడా లేకుండా పోయింది. దీంతో శివలింగాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి, కార్తీకమాసం నేపథ్యంలో పలువురు భక్తులు ఆలయానికి వచ్చి పూజలు చేస్తున్నారు. దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. తాగునీరు వసతి కల్పించారు. ఐతే శక్తిపీఠాల్లోని శివలింగాలను చూసి ఆవేదన చెందుతున్నారు. దాతలు స్పందించి షెడ్డు ఏర్పాటు దిశగా చొరవ చూపాలను వేడుకుంటున్నారు.